మనం తలపెట్టిన బంద్‌లో జంట నగరాలు అల్లాడిపోవాలి. మనమెంత పకడ్బందీగా బంద్ నిర్వహిస్తే హైకమాండ్ ముందు మన ఇమేజ్ అంత పెరుగుతుంది. గుర్తుంచుకో. పాతబస్తీ చాలా కీలకమైన ప్రదేశం. అక్కడ బంద్‌ను విఫలం చేయాలని ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. అక్కడ మేనేజ్ చేయడం నీ ఒక్కడి వల్లే అవుతుంది. అందుకే ఆ బాధ్యత నీకప్పగిస్తున్నాం. జాగ్రత్త!"

తన మీద మాచిరాజుకున్న నమ్మకానికి వీరేశం ఎంతో మురిసిపోయాడు.

** ** **

ఉదయం ఆరయింది.

పాల పాకెట్లూ, న్యూస్ పేపర్లూ తెచ్చుకోవడానికి జనం హడావిడిగా పరుగులు తీస్తున్నారు. ఇంతలో ఓ ఆర్టీసీ బస్సొచ్చి చార్మినార్ దగ్గరాగింది. అందులో పది, పదిహేను మంది కంటే ఎక్కువగా లేరు ప్రయాణీకులు.

"బంద్ అంటే ఇంత నిర్లక్ష్యమా కొడుకులకి!" ఐరన్ రాడ్ మీద వేళ్ళు బిగిస్తూ కసిగా అన్నాడు వీరేశం. అతని ముఖ కవళికల్ని ఆదేశంగా భావించి బస్సు వేపు పరుగులు తీశారు అతని అనుచరులు. ప్రమాదాన్ని పసిగట్టిన ప్రయాణీకులు దిగి చెల్లా చెదరయ్యారు. 'కార్యకర్తలు' చేతుల్లో అద్దాలు భళ్ళున పగిలిపోయాయి. ఒకడు బస్సులో పెట్రోలు చల్లడం, మరొకడు అగ్గి పుల్లగీసి విసిరేయడం క్షణంలో జరిగిపోయాయి. భగ్గున లేచిన మంటల్లో టైర్లు తగలబడుతున్న దుర్వాసన వాడంతా వ్యాపించింది. లక్షలు ఖరీదు చేసే బస్సు తగలబడిపోతుంటే డ్రైవరూ, కండక్టరూ ప్రేక్షకుల్లా చూస్తూ నిలుచుండిపోయారు.

తమ సాహసకార్యానికి సంకేతంగా వీరేశం బృందం సంతోషంగా నినాదాలు చేసింది.

తగులబడి పోతున్న బస్సును కళ్ళారా చూశాక, వ్యాపారస్తులెవరూ తమ దుకాణాల్ని తెరిచే సాహసం చేయలేదు.

తెల్ల వారిని ప్రతిఘటించేందుకు రూపొందించిన సత్యాగ్రహం, నిరాహార దీక్షలు రూపాంతరం చెంది కాలక్రమేణా తమ ప్రయోజనాన్ని నిజాయితీని విస్మరించాయి. చీటికీ మాటికీ తలపెట్టే బంద్‌లు ప్రభుత్వం కళ్ళు తెరిపించడం మాట అటుంచి, ప్రజల్ని నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అయితే ఈ విషయంలో ప్రభుత్వం తప్పు కూడా కొంత లేకపోలేదు. ప్రజలకు ఏదైనా అన్యాయం జరిగితే, అదో పెద్ద రభసగా తయారై తమ ఉనికికే ప్రమాదంగా పరిణమిస్తే తప్ప దాని విషయం పట్టించుకోవడం లేదు ఇప్పటి ప్రభుత్వాలు.

వీరేశంలాగే మరికొందరు చేసిన విధ్వంసకాండ నగరమంతా వ్యాపించింది. ఆఫీసులు తెరవలేదెవ్వరూ. ఎంతో రద్దీగా ఉండే జంట నగరాల్ని స్మశాన నిశ్శబ్దం ఆవరించింది.

ఇంతలో సికిందరాబాద్‌లో 'బంద్' నిర్వహిస్తున్న కార్యకర్తల మీద పోలీసులు చేయి చేసుకున్నారన్న వార్త అందింది వీరేశానికి.

"మీరు జాగ్రత్తగా ఉండండి. ఎవడ్నీ బయటకు వెళ్ళనీయకండి. ఎంత అర్జెంటు పని అని మొత్తుకున్నా కరిగిపోవద్దు. అరగంటలో వచ్చేస్తాను!" అంటూ మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు వీరేశం, సికిందరాబాద్ చేరుకోవడానికి.

** ** **

"అత్తయ్యా, నాకెలాగో అవుతోంది. కళ్ళు తిరుగుతున్నాయి" ఒక చేతిని కడుపుపై ఉంచుకొని మరో చేతిని గోడపై ఆనించి నిలబడడానికి ప్రయత్నిస్తూ అంది తొమ్మిది నెలల నిండు గర్భిణి.

"సమయానికి ఇప్పుడే ఎవ్వరూ ఇంట్లో లేకుండా వెళ్ళాలా! ఏం చేయాలిరా భగవంతుడా!" గాభరా పడింది వనజ అత్తగారు.

అత్తగారందించిన చేయూతతో ముందు గది దాకా నడిచి మంచంపై నడుం వాల్చిన వనజకు అవి పురిటి నొప్పులని వెంటనే అర్థమయింది. బాధతో మూలుగుతున్న కోడల్ని "ఏం ఫరవాలేదమ్మా!" అని సముదాయిస్తోంది గాని తన కోడలకు సుఖ ప్రసవం కాదని ఆమెకు బాగా తెలుసు. తొలి కాన్పు కాకుండా ఆపరేషన్ జరుగబట్టి సరిపోయింది గాని లేకుంటే ఆమె తమకు దక్కేది కాదనీ ఆమెకు తెలుసు.



వనజ మూల్గులకు, ఆమె అత్తగారి ఆందోళనకు ఇరుగు పొరుగు వారు గుమికూడారు. "త్వరగా హాస్పిటల్‌కు తరలిస్తే మంచిది!" సలహా ఇచ్చిందొకావిడ.

వనజ అత్తగారు గడపదాటి ఆటో రిక్షాలు కనబడతయేమోనని వీధి మలుపుదాకా దృష్టి సారించింది. రోడ్డంత నిర్మానుష్యంగా ఎడారిలా ఉంది. 'ఎంతో సందడిగా హడావిడిగా ఉండే హైదరాబాదేనా ఇది!' అని అనుమానం కలిగేలా ఉంది. అంత దూరంలో ఓ కరెంటు స్థంభం పక్కన నిలబడిన సైకిలు రిక్షా కనబడింది. వెంటనే పరుగులాంటి నడకతో రిక్షా వాడిని సమీపించి, "హాస్పిటల్‌కు వస్తావా బాబూ!" అని అడిగిందామె.

"హాస్పిటల్‌కు వెళ్ళాలంటే మెయిన్ రోడ్డు దాటాలి. అక్కడ అంతా గొడవ చేస్తున్నారమ్మా. రిక్షా వాళ్ళను కూడా దయతలచడం లేదు. ఐదు రూపాయల బేరానికి చూసుకుంటే రెండు వేల రిక్షా నుగ్గయిపోతుంది. రావడానికి వీలు కాదండీ!" అంటూ రిక్షా వాడు సంజాయిషీ చెప్పుకున్నాడు.

ఇంకో రిక్షా వాడు కనబడతాడేమోనని ఆశగా దిక్కులు చూసిందామె. ఎవరూ లేరు. కోడలుకు ఏమవుతుందోనన్న భయం కలగ్గానే ఆమెకు కన్నీళ్ళు ఆగలేదు. అంత పెద్ద మనిషి, అలా చిన్న పిల్లలా ఏడుస్తుంటే రిక్షా వాడి మనసు ద్రవించింది. "పదండమ్మా... చూద్దాం... ఏమయితే అదవుతుంది" అన్నాడు వాడు ధైర్యం కూడదీసుకుని.

ఇంటి ముందాగిన రిక్షాలోకి వనజను చేరవేసి, ఆమె పక్కన వనజ అత్తగార్ని కూర్చోబెట్టారు ఇరుగు పొరుగు వాళ్ళు. నొప్పులు ఇంకా ఎక్కువ కావడంతో, వనజ బాధతో మెలికలు తిరుగుతోంది. ఆమెను కాపాడాలన్న సంకల్పం కలగడంతో, ఎముకల గూడులా ఉన్న రిక్షావాడి శరీరంలోకి కూడా కొండంత బలం ప్రవేశించింది.

అలా వీధి మలుపు తిరగ్గానే, రోడ్డు మీద మకాం వేసిన వీరేశం అనుచరులు రిక్షాను అటకాయించారు.

"ఊరంతా బంద్ పాటిస్తుంటే నీకు తెలియదురా? ఏమనుకుంటున్నావ్?" అన్నాడు గుంపులోంచి ఒకడు ముందు కొచ్చి.

"పాపం. ఈమెకు పురిటి నొప్పులు వస్తుంటే.... హాస్పిటల్‌కు...." రిక్షా వాడి మాటలు పూర్తవకుండానే, ఒకడు కోపంగా ముందుకొచ్చి రిక్షా వాడి టైర్ల నుంచి గాలి తీసేసి వికృతంగా నవ్వుతూ "పదండిరా, వాడితో మనకెందుకు" అన్నాడు తోటి వాళ్ళతో.

వాళ్ళలో ముందుకు సాగగానే, రిక్షా వాడు ధైర్యం పుంజుకుని మళ్ళీ హాస్పిటల్ వేపు ముందుకు కదిలాడు. గాలి లేని టైర్ల మీద రిక్షా లాగడం అసాధ్యంగా ఉంది.

రిక్షావాణ్ణి ఆపమని సైగ చేసింది వనజ. కడుపులో పిండం బయటకు రావడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. ఒక ప్రాణి వెలుతురు చూడ్డానికి కుతూహలపడుతుంటే, మరో ప్రాణికి ప్రపంచమంతా అంధకార బంధురంగా తోస్తోంది.

రెండు చేతులలో కడుపును అదిమిపట్టుకొని పెనుగులాడుతున్న వనజకు బాధ ఒక్కసారి తగ్గినట్లయింది. ఆమె శ్వాస శాశ్వతంగా ఆగిపోయింది. పక్కనే ఉన్న అత్తగారు పెద్దగా ఏడవసాగింది. గుండెలు బాదుకుంటూ.

** ** **

"మొత్తానికి బంద్ విజయవంతమయ్యిందోయ్, మీ లాంటి యువకుల పట్టుదలతో! ఒక్క పురుగు కూడా తిరగలేదు ఇవ్వాళ రోడ్ల మీద. ఈ దెబ్బతో మనం ప్రభుత్వ పతనానికి నాంది పలికినట్లే!" టీపాయ్ ముందున్న విస్కీ గ్లాసులో సోడా కలుపుకుంటూ అన్నాడు మాచిరాజు.

"వీరేశమే లేకుంటే, పాత బస్తీలో బంద్ ఇంత గట్టిగా జరిగుండేది కాదు!" పక్కనే నాయకుడి ప్రశంసకై ఎదురుచూస్తూ నిలబడ్డ వీరేశాన్ని ఆప్యాయంగా భుజం తట్టి అన్నాడు మాచిరాజు. సంతోషంగా ఉక్కిరి బిక్కిరి అయ్యాడు వీరేశం.

పార్టీ వాళ్ళతో సెలవు తీసుకుని, రాత్రి ఎనిమిదింటి ఇంటి ముఖం పట్టాడతను.

** ** **

ఇల్లు చేరుకోగానే, ఎప్పటిలా అతని నాలుగేళ్ల పాప ఎదురొచ్చి అతన్ని వాటేసుకోలేదు. అతని శ్రీమతి నవ్వుతూ ఎదురొచ్చి అతన్ని ఆహ్వానించలేదు.

ఎప్పుడూ మౌనంగా మూలన కూర్చుండే అరవయ్యేళ్ళ తల్లి మాత్రం ఒక్కసారి పరుగెత్తి వచ్చి అతన్ని వాటేసుకుని భోరుమంది.

ఏమీ అర్థంకాక, కొయ్యలా నిలబడి చూస్తున్న వీరేశానికి గుమ్మం ఎదురుగా పడుకోబెట్టిన ఓ శరీరం కనబడింది! ఆ శవం అతని ఇల్లాలు వనజది!

దాదాపు అదే సమయానికి విజయోత్సాహంతో ఓ ఫుల్ బాటిల్ ఖాళీ చేసిన మాచిరాజు మరో దానికోసం ఫ్రిజ్ తలుపు తెరిచాడు.